క్లుప్తంగా

నల్లపోచమ్మకు ఎమ్మెల్యే పూజలు



పోచమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మను ఎమ్మెల్యే సునీతారెడ్డి గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వెంట నర్సాపూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ నయీం, సత్యంగౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం



ర్యాలీలో పాల్గొన్న పార్టీ జిల్లా కార్యదర్శి

నర్సాపూర్: ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఖాలేక్ అన్నారు. గురువారం నాటికి సీపీఐ పార్టీ వందేళ్లు కావొస్తున్న తరుణంలో పట్టణంలో పార్టీ నాయకులు కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సమస్యల పరిష్కారం కోసం తమ ఉద్యమిస్తామన్నారు.

ఘనంగా వీర్ బాల్ దివస్



నివాళులర్పిస్తున్న సిక్కులు

కొడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కొడిపల్లిలో వీర్ బాల్ దివస్‌ను సిక్లికర్ సిక్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం సిక్లికర్ సిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు కిచ్చి షేర్‌సింగ్, కార్యదర్శి వీర్‌సింగ్ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ వద్ద వీర్‌బాల్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో వీరుసింగ్, జ్ఞాన్‌సింగ్, సంతోష్ సింగ్, భగత్‌సింగ్, సంషేర్‌సింగ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నర్సాపూర్: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ల స్థానంలో ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను రద్దు చేయాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సమాన వేతనం ఉండాలని సుప్రీం కోర్టు ఆదేశాలను పాటించాలన్నారు.

పాడుబడిన బావుల పూడ్చివేత



శివ్వంపేట(నర్సాపూర్): వ్యవసాయ పొలాల్లో పాడుబడిన బావుల పూడ్చివేత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. షేగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాడుబడిన బావులతో పాటు ప్రధాన రోడ్ల పక్కన ప్రమాద భరితంగా ఉన్న బావులకు పూడ్చేందుకు చర్యలు చేపట్టారు. ఎదుల్లాపూర్, చెన్నాపూర్, సికింద్లాపూర్ గ్రామాల్లో చెరువుల్లోని పూడికతీత, కట్టకు మరమ్మతు పనులు చేస్తున్నారు. బావులను పూడ్చేందుకు రైతులకు ఎలాంటి ఖర్చు లేకుండా స్వచ్ఛంద సంస్థ చెరువుల్లో జేసీబీలు, హిటాచీలతో మట్టి తవ్వకాలు చేస్తూ టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తూ పాడుబడిన బావులను పూడ్చివేస్తున్నారు.

కనులపండువగా శోభాయాత్ర

గజ్వేల్‌రూరల్: అయ్యప్పస్వామి శోభాయాత్ర పట్టణంలో గురువారం కనులపండువగా సాగింది. స్థానిక అయ్యప్ప ఆలయం నుంచి ప్రధాన వీధులగుండా అంగడిపేట హనుమాన్ దేవాలయం వరకు అయ్యప్ప భక్తుల భజనలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, అల్వాల బాలేశ్, గురుస్వాములు ఎర్రం శ్రీనివాస్, బొగ్గుల సురేశ్, దుర్గాప్రసాద్, బొగ్గుల సురేశ్, గంగిశెట్టి రాజు, ఎల్లం రాజు పాల్గొన్నారు.

ఏమరుపాటు.. ప్రాణానికి చేటు

- వ్యవసాయంలో పెరిగిన యంత్రాల వినియోగం
- కేజ్‌వీల్స్‌తో దమ్ము పనులు
- మృత్యువాత పడుతున్న అనుభవంలేని డ్రైవర్లు



దమ్ము చేస్తుండగా కేజ్‌వీల్స్ కిందపడి మృతిచెందిన రైతు(ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): పొలాలను ట్రాక్టర్‌తో దమ్ము చేసే డ్రైవర్లు పొలం పనులు చేసే సమయంలో అజాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఒక్కోసారి ప్రాణాలు కోల్పోతున్నారు. కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు బోల్తాపడి ఏటా ప్రాణనష్టం జరుగుతోంది. తాజాగా ఆరు రోజుల క్రితం మండలంలోని ఆరెగూడెంలో వ్యవసాయ పొలాన్ని సాగుకు సన్నద్ధం చేసే క్రమంలో ప్రభాకర్ అనే రైతు ప్రమాదవశాత్తు కేజివీల్స్ కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. సాగులో యంత్రాల వినియోగం పెరిగిన నేపథ్యంలో సరైన అవగాహన లేకుండా అజాగ్రత్తగా ట్రాక్టర్లు నడపడం వల్ల డ్రైవర్లు ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

ప్రమాద కారణాలు..

పొలాలన్నీ ఒకే విధంగా ఉండవు. భూమి ఎలాంటిదో డ్రైవర్ గుర్తించకపోవడం. పొలం దున్నినకొద్దీ అక్కడక్కడ గుంతలు ఏర్పడతాయి, వాటిని సరిగా గుర్తించకపోవడంతో ప్రమాదం సంభవిస్తుంది. గట్టి ప్రదేశానికి వెళ్లడానికి డ్రైవర్లు యాక్సిలేటర్‌ను ఎక్కువగా ఇస్తుంటారు, బరువంత కేజ్ వీల్స్‌పై పడడంతో ముందు టైర్లు బరువు లేకపోవడంతో ట్రాక్టర్ బోల్తాపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పొలం చివరి మూలల్లో ఎక్కువ సార్లు కేజ్‌వీల్స్ నడుస్తాయి. అక్కడ లోతుగా తయారవుతుంది, వేగంగా వెళ్లే క్రమంలో దిగబడి బోర్లా పడుతుంది. డ్రైవర్లకు నైపుణ్యం లేకపోవడం, ఓవర్ స్పీడ్‌తో పొలం దున్నడంతో ప్రమాదాలు జరుగుతాయి. పొలం దున్నేటప్పుడు వేగంగా వెళ్లి ఒక్కసారి బ్రేకులు వేయడం వలన బోల్తాపడే అవకాశం ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

కేజ్‌వీల్స్ బిగించేటప్పుడు తప్పనిసరిగా వెనుక టైర్లు సమాన స్థాయిలో ట్రాక్టర్ బంపర్ ముందు వెయిట్ బిళ్లలు వేసుకోవాలి. బరువు ఎక్కువైతే మైలేజ్ తక్కువ వస్తుందనే ఉద్దేశంతో బరువులు పెట్టకపోవడం సరికాదు. ట్రాక్టర్ కండిషన్‌ను పొలంలోకి దిగకముందే పరిశీలించి, ఒకే వేగంతో నడపాలి. యజమానులు, ఇతరుల మెప్పుకోసం వేగంగా నడపకూడదు. దున్నేటప్పుడు ట్రాక్టర్‌కు కల్టీవేటర్ అమర్చుకుంటే బోల్తాపడే అవకాశాలు తక్కువగా ఉంటాయి.

తొందర వద్దు..



మడుల్లో నీరు ఎక్కువగా ఉంచాలి. దీంతో ట్రాక్టర్ సులువుగా తిరగ గలుగుతుంది. పొలంలో ఫుల్ కేజ్‌వీల్స్‌తో దున్నితే 90 సెంటీమీటర్ల లోతుగా వెళ్తుంది. దీంతో భూమి సారం తగ్గే అవకాశం ఉంది. హాఫ్ కేజ్‌వీల్స్‌తో పాటు రొటోవేటర్‌తో దున్నితే 15 సెంటీ మీటర్ల లోతు వెళ్లి భూ సారం కాపాడుకోవచ్చు. కేజ్‌వీల్స్‌తో కాకుండా రోటోవేటర్‌తో దమ్ముచేయడం వల్ల రైతులకు మేలు కలుగుతుంది.

– రామ్‌శివరాం, ఏఓ, మాసాయిపేట

అప్రమత్తంగా నడపాలి



డ్రైవర్‌లు పొలాన్ని తొందరగా దున్నాలన్న ఉత్సాహంతో ట్రాక్టర్‌ను ఇష్టారీతిగా నడుపుతుంటారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అనుభవం, లైసెన్స్ కలిగి ఉన్నవారు తగు జాగ్రత్తలు పాటిస్తూ వాహనం నడిపితే ప్రమాదాలు నివారించవచ్చు.

– రాజు, ఎస్‌ఐ, వెల్దుర్తి

ఆర్టీసీ బాదుడుపై ఆగ్రహం

చిన్నశంకరంపేటలో బస్సును నిలిపివేసిన ప్రయాణికులు

చిన్నశంకరంపేట(మెదక్): పండుగపూట ప్రయాణికులకు ఆర్టీసీ షాక్ ఇచ్చింది. స్పెషల్ బస్సుల పేరుతో బస్సు టికెట్ రేట్లు అమాంతం పెంచడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ ధరకు 30 శాతం పెంచారు. ఉచిత బస్ ప్రయాణం చేస్తామని వస్తున్న మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదు. గురువారం మెదక్ నుంచి బయలుదేరిన డీలక్స్ బస్సులో టికెట్ల రేట్‌పై ప్రయాణికులకు ఆర్టీసీ సిబ్బందికి ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో చిన్నశంకరంపేటలో కొద్దిసేపు బస్సును నిలిపివేశారు. తోటి ప్రయాణికులు సర్దిచెప్పడంతో ప్రయాణికులు శాంతించారు. మెదక్ నుంచి చిన్నశంకరంపేటకు డీలక్స్ బస్సు రేట్ రూ.40 ఉండగా, రూ.70 చేశారు. తూప్రాన్‌కు రూ.100 ఉండగా రూ. 150, సుచిత్ర వరకు రూ.150 ఉండగా, రూ. 220 వసూల్ చేశారు. దీంతో బస్సులో ప్రయాణికులు సిబ్బందితో గొడవ పడ్డారు. స్పెషల్ అని చెప్పి డీలక్స్ బస్‌ను అన్ని స్టాపుల్లో ఆపడం ఎందుకని ప్రశ్నించారు. ముందస్తు సమాచారం లేకుండా స్పెషల్ బస్సుల పేరుతో ఎక్కువ చార్జీలను వసూలు చేయడంతో ప్రయాణికులకు సిబ్బందికి మధ్య వాగ్వాదం జరిగింది.



మెదక్ నుంచి సుచిత్రకు డబుల్ చార్జీ టికెట్



పాపన్నపేట నుంచి శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప స్వాములు

శబరిమలకు అయ్యప్ప మాలధారులు

పాపన్నపేట(మెదక్): అయ్యప్ప స్వాములు గురువారం పాపన్నపేట నుంచి శబరిమలకు బయలు దేరి వెళ్లారు. 45 రోజులు కఠినమైన దీక్షలతో గడిపిన 31 మంది స్వాములు ఇరుముడి కట్టుకొని అయ్యప్ప దర్శనానికి పయనమయ్యారు. గురుస్వామి కృష్ణ ఆధ్వర్యంలో అయ్యప్ప ఆలయంలో స్వాములు అయ్యప్ప పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ బయలుదేరారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు కృష్ణ, సంగమేశ్వర్, రాజు, గణేశ్, రామచందర్, రాజాగౌడ్‌తో పాటు దీక్ష స్వాములు పాల్గొన్నారు. ఆకుల విఠల్ స్వామి అందరికి అన్నదాన భిక్ష నిర్వహించారు.

మహా పడిపూజ

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలోని అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం మహాపడిపూజ నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకుడు రాజు ఆధ్వర్యంలో పడిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, వార్డు కౌన్సిలర్ కృష్ణారెడ్డి, స్వాములు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి



బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో ఫ్లెక్సీలను తొలగిస్తూ మత్యువాత పడ్డ యువకుల కుటుంబ సభ్యులను గురువారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి పరామర్శించారు. ఘటన స్థలాన్ని సందర్శించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం పర్యటన కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల తొలగింపు కారణంగానే యువకులు మత్యువాత పడ్డారని, వారి మరణానికి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. సంధ్య థియేటర్ ఘటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధితురాలికి అల్లుఅర్జున్ నష్టపరిహారం చెల్లించాలని ఎలా కోరారో, ఇక్కడి ఘటనకు ప్రభుత్వం బాధ్యత వహిస్తూ బాధిత కుటుంబాల ఒక్కొక్కరికీ రూ.2 కోట్ల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. వీరి వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్, బీఆర్‌ఎస్ మండల యువజన అధ్యక్షుడు సంతోష్ రావు, కాశీనాథ్, సంతోష్ కుమార్ తదితరులు ఉన్నారు.

రామాయంపేటలో క్రికెట్ టోర్నీ



టోర్నీ వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

రామాయంపేట(మెదక్): జనవరి 8 నుంచి రామయంపేట్ లో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మల్లేశ్‌యాదవ్, ఉమామహేశ్ తెలిపారు. గురువారం జూనియర్ కళాశాల మైదానంలో లీగ్ మ్యాచ్ షెడ్యూల్ విడుదల చేసిన సందర్భంగా వారు వివరాలు వెల్లడించారు. 12 రోజుల పాటు కొనసాగే ఈ టోర్నీలో 32 మ్యాచులు జరుగుతాయని, జనవరి 19న ఫైనల్ మ్యాచ్‌తో కార్యక్రమం ముగుస్తుందన్నారు. ఐపీఎల్ తరహాలో అన్ని హంగులతో ఈ టోర్నీ కొనసాగుతుందని తెలిపారు. టోర్నీ స్పాన్సర్ బాలు, ఆర్‌ఆర్ క్రికెట్ టీం ప్రతినిధి రామ్‌కి, ఇతర క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయులను పంపొద్దు

చిన్నశంకరంపేట(మెదక్): సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు కస్తూర్బా, మోడల్ పాఠశాలలకు ప్రభుత్వ ఉపాధ్యాయులను డిప్యూటేషన్ వేసేందుకు చేపట్టిన చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలయ్య అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. సమ్మె చేస్తున్న కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులతో పాటు సర్వశిక్ష అభియన్ సిబ్బందికి న్యాయం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాల మద్దతు కూడా సర్వశిక్ష అభియన్ ఉద్యోగులకు ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సర్వశిక్ష అభియాన్ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపాలని కోరారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



శివ్వంపేటలో డేటా ఎంట్రీ చేస్తున్న కార్యదర్శి

శివ్వంపేట(నర్సాపూర్): మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. మండల వ్యాప్తంగా 11 వేల 721 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని వారికి సంబంధించి వివరాలు ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో సిబ్బంది నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు 4531 (38.66 శాతం) డేటా ఎంట్రీ పూర్తి చేశారని ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా తెలిపారు. నెలఖారు వరకు డేటా ఎంట్రీ పూర్తి చేయాలని ఈ సందర్భంగా సిబ్బందికి సూచించినట్లు ఎంపీడీఓ చెప్పారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షుడు నర్సింలు అన్నారు. లలిత, నేత్రాలయ కంటి ఆస్పత్రుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని చెప్పారు.

డ్రగ్స్‌ను అరికట్టడం అందరి బాధ్యత

- సీఐ శ్రీనివాస్



తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాస్

దుబ్బాకటౌన్: యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వాటిని అరికట్టే బాధ్యత అందరిపైనా ఉందని సీఐ పాలెపు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. దుబ్బాకతో పాటు మండల పరిధిలోని హబ్సీపూర్ గ్రామంలో పలు పాన్, కిరాణా దుకాణాల్లో డాగ్ స్క్వాడ్ సిబ్బందితో కలిసి ఆయన గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలను ఎవరైనా విక్రయించినా, రవాణా చేసిన కఠిన చర్యలు తప్పవన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో పోలీస్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.



బొర్రా గుహల వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం

విహారయాత్రలో విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): విజ్ఞానాన్ని పెంపొందించేందుకు శివ్వంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతుల విద్యార్థులను విహారయాత్రకు తీసుకెళ్లారు. విజయవాడ, అన్నవరం, వైజాక్, పీ. తాపూరం, ద్వారక తిరుమల, ద్రాక్షారామం, అరకు, బొర్రాగుహలు, మంగళగిరి తదితర సందర్శనీయ ప్రదేశాలకు వారిని తీసుకెళ్లామని హెచ్‌ఎం బాలచంద్రం తెలిపారు.

ముగిసిన చిత్తారమ్మ జాతర



చిత్తారమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లిలో వెలిసిన చిత్తారమ్మ జాతర గురువారం ముగిశాయి. ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారికి ఓడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, ఒగ్గు కథ, భక్తి భజన సంస్కృతిక కార్యక్రమాలు సాయంత్రం వరకు చేశారు. సాయంత్రం బండ్లు, బోనాల ఊరేగింపు నిర్వహించారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



జహీరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు

జహీరాబాద్ టౌన్: కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కేబినెట్ నుంచి వెంటనే తొలగించాలని మాలమహానాడు ఆధ్వర్యంలో దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా గురువారం పట్టణంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో అమిత్ షాపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు దీపక్ ఆకాష్ మాట్లాడుతూ...సమాజంలోని అణగారిన వర్గాలకు హక్కులు కల్పించేందుకు జీవితాన్ని త్యాగం చేసిన అంబేడ్కర్‌పట్ల అమిత్ షా చులకనగా మాట్లాడటం సరికాదన్నారు. వెంటనే అయనను మంత్రి పదవినుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు వడ్డి ధనరాజ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింలు, అంబేడ్కర్ సర్కిల్ అధ్యక్షుడు శ్రీనివాస్, అంబేడ్కర్ కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు రాంతీర్థం నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

గజ్వేల్: సీఎం సహాయనిధి పేదలకు వరమని మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. గజ్వేల్‌లో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ జగదేవ్‌పూర్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు కర్ణాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శివారెడ్డి, రాములు పాల్గొన్నారు.

కేవల్ కిషన్ యువతకు ఆదర్శం



రామాయంపేటలో కేవల్ కిషన్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

నర్సాపూర్: కమ్యూనిస్టు నాయకుడు కేవల్ కిషన్ జీవితం యువతకు ఆదర్శమని సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు అన్నారు. గురువారం వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేవల్ కిషన్ చిన్న వయస్సులోనే ప్రజల పక్షాన, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో భూషణం, రాజు, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఆశయాలను కొనసాగిస్తాం

మెదక్ కలెక్టరేట్: కామ్రేడ్ కేవల్ కిషన్ ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ అన్నారు. గురువారం కేవల్ కిషన్ వర్ధంతి వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని గాంధీనగర్, రామాలయం వద్ద, చేగుంట మండలం పొలంపల్లిలోని ఆయన సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక కేవల్ కిషన్ భవన్‌లో సభ నిర్వహించి పేద పిల్లలతో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు మల్లేశం, బస్వరాజు, మల్లేశం, నాయకులు అజయ్, దుర్గ, లచ్చాగౌడ్, స్వరూప, నాగమణి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట(మెదక్): కేవల కిషన్ వర్ధంతి సందర్భంగా సీపీఎం పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి బాలమణి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిటీ సభ్యులు స్వామి, నజీద్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల ఆశాకిరణం

వెల్దుర్తి(తూప్రాన్): పేద ప్రజల ఆశాకిరణం కామ్రేడ్ కేవల్ కిషన్ అని సీఐటీయూ మండల నాయకుడు గౌరీ పిలుపునిచ్చారు. మండలంలోని రామాయిపల్లిలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



నర్సాపూర్: కేవల్ కిషన్ చిత్రపటం వద్ద ..



పొలంపల్లిలోని కేవల్ కిషన్ సమాధి వద్ద ..